సాక్షి అనకాపల్లి

గురువారం । 2 । ఫిబ్రవరి । 2023



జీ-20కి విశాఖ ముస్తాబు

జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో 119 అంశాలను సభ్యులు ఆమోదించారు. జీ-20 సదస్సు కోసం విశాఖను తీర్చిదిద్దనున్నారు. 18లో



త్వరలో రేషన్‌లో చిరుధాన్యాలు

విశాఖ: రేషన్ కార్డుదారులకు మున్ముందు రాగులు, జొన్నలు కూడా పంపిణీ చేయనున్నట్టు మంత్రి కారుమూరి చెప్పారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

విశాఖ: విశాఖ కార్యనిర్వాహక రాజధాని కాబోతోందని సీఎం చేసిన ప్రకటనను స్వాగతిస్తూ.. మంత్రి అమర్ క్షీరాభిషేకం చేశారు.

న్యూస్‌రీల్

రేషన్ కార్డుపై గోధుమ పిండి

- పంపిణీ ప్రారంభించిన జేసీ



కార్డుదారులకు గోధుమ పిండి ప్యాకెట్లు అందిస్తున్న జేసీ కల్పనాకుమారి

అనకాపల్లి టౌన్: రేషన్ కార్డుపై కొత్తగా గోధుమ పిండి అందిస్తున్నారు. జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి గవరపాలెం 35వ రేషన్ డిపోలో బుధవారం గోధుమపిండి ప్యాకెట్ల పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోధుమతో చేసిన ఆహార పదార్థాలతో ఇమ్యూనిటీని పెంచుకోవచ్చని, మధుమేహ రోగులకు ఆరోగ్యకరమని చెప్పారు. జిల్లా పౌరసరఫరాల అధికారి కె.వి.ఎస్.ప్రసాద్, ఎంఎస్‌వో చుక్క కల్యాణ్‌కుమారి, సీఎస్‌డీటీ ఈశ్వరరావు, పెంటకోట నాయుడు, డిపో డీలర్లు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్చాలని వినతి

మహారాణిపేట (విశాఖ దక్షిణ): రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరు నాగేశ్వరరావును పౌరసరఫరాల శాఖలో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగుల సంగం రాష్ట్ర నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పలు సమస్యలపై మంత్రికి వినతిపత్రం సమర్పించారు. తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్న సుమారు 750 మంది అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్లను కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్పు చేయాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

కశింకోట తహసీల్దార్ సస్పెన్షన్



తహసీల్దార్ బి.సుధాకర్

కశింకోట: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కశింకోట తహసీల్దార్ బి.సుధాకర్‌ను సస్పెండ్ చేసినట్లు జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టాదారు పాసు పుస్తకాల మ్యుటేషన్‌లో ఆర్వోఆర్ చట్ట నిబంధనలు పాటించకపోవడం, నిర్లక్ష్య వైఖరి వహించడం, అర్హులైన రైతులను ఇబ్బందులకు గురి చేయడం తదితర కారణాలతో ఈ చర్య తీసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా భూముల సమగ్ర సర్వేను సవ్యంగా పర్యవేక్షించలేదని జేసీ విచారణలో వెల్లడైంది. ఈ కారణాలతో తహసీల్దార్‌ను సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఫిర్యాదుల వెల్లువ

పాసు పుస్తకాలు అర్హులకు కాకుండా అనర్హులకు జారీ చేయడం, మ్యుటేషన్‌లో నిబంధనలు పాటించకుండా వేరొకరి పేరున భూములు దఖలు పరచడంపై బాధిత రైతుల నుంచి ఫిర్యాదులు వెల్లాయి. నరసింగబిల్లికి చెందిన మజ్జి ప్రకాశరావు పేరిట 1994లో జారీ అయిన పట్టాదారు పాసు పుస్తకంలో అతనికి తెలియజేయకుండా.. మరొకరి పేరున మార్పు చేసి పాసు పుస్తకం ఇవ్వడం వివాదాస్పదమైంది. సమగ్ర భూముల సర్వే పలు గ్రామాల్లో సక్రమంగా జరగలేదని ఆరోపణలున్నాయి. సంబంధిత రైతులు లేనప్పటికీ ఇష్టానుసారంగా అనామకుల పేర్లు నమోదు చేసి వాటిని మార్పు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేయడం, సర్వే లోపభూయిష్టంగా జరగడం తదితర విషయాలపై రైతుల నుంచి ఫిర్యాదులు వెల్లాయి. జగనన్న కాలనీలకు చింతలపాలెంలో దూరంగా ఉన్న భూములు కొనుగోలు చేయడం వల్ల అక్కడకు లబ్ధిదారులు వెళ్లడానికి ముందుకు రాని పరిస్థితి ఏర్పడింది. కాలనీ రద్దు చేయాల్సి వచ్చింది. ఈ ఆరోపణలు సస్పెన్షన్‌కు దారి తీశాయి.

విశాఖపై సీత కన్ను!

- రైల్వే జోన్ ఊసే లేదు..
- మెట్రో రైలు ప్రతిపాదనలు బుట్టదాఖలు
- 'భోగాపురాన్ని' విస్మరించిన ఆర్థిక మంత్రి
- స్టీల్‌ప్లాంట్‌కు రూ.683 కోట్లు..
- పెట్రోలియం యూనివర్సిటీకి రూ.168 కోట్లు..
- వీపీఏకు రూ.337 కోట్ల కేటాయింపు
- కేంద్ర బడ్జెట్‌లో విశాఖకు మొండి చెయ్యి
- అల్లూరి జిల్లాలో 17 ఏకలవ్య పాఠశాలలకు మేలు చేకూరే అవకాశం



మోదం : స్టీల్‌ప్లాంట్‌కు నిధులు

సాక్షి, విశాఖపట్నం: కేంద్ర బడ్జెట్ అంటే ఎన్నెన్నో ఆశలు.. మరెన్నో ఆకాంక్షలు.. అందుకే ఈ బడ్జెట్‌లో తమకు, తమ ప్రాంతానికి మేలు జరుగుతుందని ఎంతగానో ఎదురు చూస్తారు. కానీ బుధవారం నాటి బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ విశాఖపై సీతకన్నే వేశారు. అరకొర కేటాయింపులతోనే సరిపెట్టారు. ఈ బడ్జెట్‌లో స్టీల్‌ప్లాంట్‌కు రూ.683 కోట్లు, పెట్రోలియం విశ్వవిద్యాలయానికి రూ.168 కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నారు. విశాఖ పోర్టు అథారిటీ (వీపీఏ)కి మాత్రం రూ.337.69 కోట్లు కేటాయించారు. గత ఏడాది బడ్జెట్‌లో వీపీఏకు రూ.158.39 కోట్ల కేటాయింపులు జరిగాయి. ఇక ఎన్నో ఆశలు పెట్టుకున్న వాటికి మాత్రం బడ్జెట్‌లో ఆర్థికమంత్రి కనికరం చూపలేదు. విశాఖకు దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను ప్రకటించి నాలుగేళ్లు దాటింది. కానీ ఈ బడ్జెట్‌లో విశాఖ రైల్వే జోన్ జోలికే వెళ్లలేదు. ఈ బడ్జెట్‌లోనైనా రైల్వే జోన్‌కు నిధులు కేటాయిస్తారని గంపెడాశలు పెట్టుకున్న విశాఖ వాసులకు నిరాశ మిగిల్చారు. విశాఖకు కొత్తగా రైల్వే ప్రాజెక్టుల కేటాయింపూ లేదు. మెట్రో రైలు ప్రతిపాదనలను కూడా బుట్టదాఖలు చేశారు. ప్రతిష్ఠాత్మక భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి నిధుల కేటాయింపుపైనా ప్రస్తావన లేదు. సాధారణంగా కేంద్ర బడ్జెట్‌లో వెనబడిన జిల్లాల అభివృద్ధికి నిధుల కేటాయింపు జరుగుతుంది. ఈ బడ్జెట్‌లో వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలకు ఆ నిధుల కేటాయింపు ఉంటుందని తద్వారా విశాఖ అభివృద్ధికి దోహద పడుతుందని ఆశించారు. అయితే ఈ ఆశలపై



ఖేదం: ప్రస్తావన లేని రైల్వే జోన్

కూడా నిర్మలా సీతారామన్ నీళ్లు చల్లేశారు.

వీటిపైనే కొన్ని ఆశలు

ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ టూరిస్ట్ సర్క్యూట్స్ కింద ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. ఈ నిధులు మంజూరైతే విశాఖ నగరం, జిల్లాతో పాటు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పర్యాటక రంగం అభివృద్ధికి వీలుకానుంది. ఏకలవ్య పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, బోధన సిబ్బంది పెంపు వంటి వాటికి బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇవ్వడం వల్ల అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 17 స్కూళ్లకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. మరోవైపు కేంద్ర బడ్జెట్‌లో ఈ ప్రాంతానికి జరిగిన అన్యాయంపై సీపీఐ ఆధ్వర్యంలో విశాఖ రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. విశాఖ పట్ల కేంద్ర వైఖరిపై మండిపడ్డారు.

వారికి మేలు



కేంద్ర బడ్జెట్ ఫీల్ గుడ్.. నో హార్మ్ బడ్జెట్.. దేశ ఆర్థిక పరిస్థితి మెరుగు పడడానికి దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించారు. ప్రధానంగా తయారీ రంగం వృద్ధికి అధిక ప్రాధాన్యం లభించింది. మొబైల్ పరికరాల దిగుమతి సుంకం తగ్గించడంతో వీటి తయారీ పెరిగి, ధర తగ్గుతుంది. మొబైల్ తయారీ రంగంలో ప్రపంచంలో నంబర్ వన్ కావడానికి వీలవుతుంది. తక్కువ ఆదాయ వర్గాలకు పన్ను తగ్గింపు, అధిక ఆదాయ వర్గాలకు సర్‌చార్జీల తగ్గింపుతో సమతుల్యత పాటించారు. ఎంఎస్‌ఎంఈలు వృద్ధి చెందే నిర్ణయాలతో కొత్త పరిశ్రమలు ఏర్పాటై ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. వ్యవసాయ రంగం గిట్టుబాటు చర్యల్లో భాగంగా చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడంతో వీటి ఎగుమతులు పెరిగి రైతులకు మంచి ధర లభిస్తుంది.

– ఆకుల చంద్రశేఖర్, ఫౌండర్ పార్టనర్, సార్క్ అండ్ అసోసియేట్స్

ఏఐకీ ప్రాధాన్యం మంచిదే..



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సెంటర్లను ఏర్పాటు చేయాలన్న కేంద్ర నిర్ణయం హర్షణీయం. ఇది గేమ్ ఛేంజర్ అవుతుంది. దేశంలో 30 నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తుండడమూ ముదావహమే. అయితే 5 మిలియన్ల ఐటీ వర్క్ ఫోర్స్ ఉన్నా 0.3 మిలియన్ల మంది మాత్రమే సముచిత నైపుణ్యాలతో ఉన్నారు. అన్ని నైపుణ్య రంగాల్లో ఒకే మోడల్ పని చేయదు. 5జీ యాప్స్, కొత్త డాటా పాలసీతో డీప్ టెక్ పర్యావరణ వ్యవస్థకు సహాయకరంగా ఉంటుంది.

–శ్రీధర్ కొసరాజు, రాష్ట్ర అధ్యక్షుడు, ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్

సమన్వయంతోనే స్త్రీ శిశు సంక్షేమం

- వైద్య ఆరోగ్య శాఖ సమావేశంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



తుమ్మపాల : ఆశా, ఏఎన్‌ఎం, అంగన్వాడీలు సమన్వయంతో పనిచేసినపుడే గ్రామాలలో స్త్రీశిశు సంక్షేమం సాకారమవుతుందని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. పట్టణంలోని గుండాల వీధి సచివాలయంలో బుధవారం వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీహెచ్‌సీ డాక్టర్లు, సీడీపీవోలు పూర్తి సమన్వయంతో తల్లీపిల్లల ఆరోగ్య పరిస్థితులపై దృష్టి పెట్టాలన్నారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న విషయాల పట్ల అవగాహన ఉండాలన్నారు. ముఖ్యంగా గర్భిణుల ఆరోగ్యం, కాన్పుల పట్ల మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. కౌమార దశ, గర్భిణుల్లో రక్తహీనతను గుర్తించి, దానికి తగిన చికిత్సతో పాటు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి కుటుంబ ఆరోగ్య పరిస్థితులపై ఆశ, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలకు పూర్తిగా తెలిసి ఉండాలన్నారు. అదేవిధంగా ఆయా ప్రాంతాల్లో ఉన్న పరిస్థితులపై, సిబ్బంది పనితీరుపై అధికారులకు పట్టు ఉండాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ముఖ్యంగా గర్భిణుల ఆరోగ్య సమస్యలను గుర్తించి అవసరమైతే దగ్గర్లో ని పీహెచ్‌సీ, ఆస్పత్రికి తీసుకెళ్ళాలని తెలిపారు. అంతకుముందు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా లో సంభవించిన ప్రసవ మరణాలపై కేజీహెచ్ గైనకాలజిస్ట్ డాక్టర్ కె.శ్యామలతో మాట్లాడి మరణాలకు గల కారణాలను తెలుసుకున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హేమంత్, డీసీహెచ్‌ఎస్ శ్రావణ్‌కుమార్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పీహెచ్‌సీల వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఏదేమైనా.. ఒకటో తేదీనే ఇచ్చేయాలి

- పింఛన్ల పంపిణీలో వలంటీర్ల నిబద్ధత
- సొంత ఖర్చులతో ఎక్కడున్నా అందజేత

అనకాపల్లిటౌన్ : ప్రతి నెలా ఒకటో తేదీ వస్తుందంటే చాలు.. పింఛన్ కానుక అందజేయడంలో వలంటీర్లు బిజీ. అదేదో తమ విధి మాత్రమే అనుకోవట్లేదు. ఓ పవిత్ర యజ్ఞంలా భావిస్తున్నారు. వారికి తెలుసు.. తామిచ్చే రూ.2,750 గ్రామీణ ప్రాంతాల్లో ఓ కుటుంబానికి ఓ నెల బతుకుతెరువని. ఆ మొత్తం కోసమే వయసుడిగిన వృద్ధులకు కుటుంబంలో కాస్తయినా.. గౌరవముందని. అందుకే ఒకటో తేదీ వస్తోందంటే.. ముందు రోజు రాత్రి నిద్రకు కూడా సెలవిచ్చి.. తొలి వేకువజాము నుంచే ఇంటింటికీ వెళ్లి పింఛన్ కానుక అందిస్తున్నారు. సీఎం జగనన్న నమ్మకాన్ని నిలబెడుతూ.. వృద్ధులు, వితంతువులు, వికలాంగుల అభిమానాన్ని చూరగొంటున్నారు.

వైఎస్సార్ పింఛన్ కానుకను బుధవారం తెల్లవారుజామున 4 గంటల నుంచి సాయంత్రం వరకు పట్టణంలో 85 శాతం పూర్తి చేసినట్టు జోన్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు. జోన్ పరిధిలో 10,200 మంది పింఛన్‌దారులకు ప్రతి నెలా ప్రభుత్వం రూ.2 కోట్ల 83 లక్షల 86 వేల 500 అందిస్తున్నట్టు చెప్పారు.



కేజీహెచ్‌లో గాదయ్యకు పింఛన్ అందిస్తున్న వంశీకృష్ణ

ఆ ఒక్కరి కోసం..

గర్నికం గ్రామ వాలంటీర్ వంశీకృష్ణ కేజీహెచ్‌కు బుధవారం వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న కేశంశెట్టి గాదయ్యకు పింఛన్ అందించాడు. తన పరిధిలోని ఒక్కరు తప్ప లబ్ధిదారులందరికీ ఉదయాన్నే పింఛన్ పంపిణీ చేశాడు. మిగిలిన ఆ ఒక్కరు ఆ గ్రామానికి చెందిన గాదయ్య. అనారోగ్యంతో ఆయన విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నట్టు వంశీకృష్ణ తెలుసుకున్నారు. దీంతో అక్కడికే వెళ్లి పింఛన్ సొమ్ము అందించాడు. అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నాడు. కుటుంబ సభ్యుల్లో భరోసా నింపి, వారి ఆశీస్సులు పొందాడు.

– రావికమతం



సత్యనారాయణకి పింఛన్ నగదును అందిస్తున్న వలంటీర్ స్వాతి

సొంత ఖర్చులతో..

కె.కోటపాడు గ్రామానికి చెందిన తామరపల్లి సత్యనారాయణ గత ఐదు రోజులుగా అనారోగ్యంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. దీంతో ఆ గ్రామ వలంటీర్ ఎం.స్వాతి తన సొంత ఖర్చులతో బుధవారం కేజీహెచ్‌కు చేరుకున్నారు. ఆస్పత్రి బెడ్‌పై ఉన్న సత్యనారాయణ బయోమెట్రిక్ తీసుకుని పింఛన్ నగదును అందించారు. సామాజిక బాధ్యతతో వలంటీర్ స్వాతి చేస్తున్న సేవలను ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, ఎంపీడీవో శచీదేవి, పంచాయితీ కార్యదర్శి ప్రసాద్‌లు అభినందించారు.

– కె.కోటపాడు

18 మంది టీచర్లకు షోకాజ్ నోటీసులు



డి.యర్రవరం హైస్కూల్లో ట్యాబ్‌లో విద్యార్థి చేసే అంశాలను పరిశీలిస్తున్న డీవైఈవో ప్రేమ్‌కుమార్, ఎంఈవో అమృత్‌కుమార్

- విధుల్లో నిర్లక్ష్యమే కారణం
- రెండో విడత 'నాడు–నేడు'కు రూ.260 కోట్లు
- ఉప విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్

నాతవరం: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన 18 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు జిల్లా ఉప విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ తెలిపారు. బుధవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాండవ, డి.యర్రవరం హైస్కూళ్లలో చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో భాగంగా విద్యార్థుల నోట్‌బుక్స్‌ను సంబంధిత టీచర్లు పరిశీలించని, సిలబస్ సకాలంలో పూర్తి చేయని విషయాన్ని గుర్తించి, జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు తాండవ హైస్కూల్లో ఇద్దరు, డి.యర్రవరం హైస్కూల్లో 16 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇచ్చామన్నారు. పని తీరులో మార్పు రాకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంతకు ముందు ఉదయం ఆయన తాండవ, డి.యర్రవరం హైస్కూళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తాండవ హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో మాట్లాడి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేసి, రోజూ ఇలానే ఉంటుందా అని విద్యార్థుల్ని ఆరా తీశారు. తరగతి గదిలోకి వెళ్లి కాసేపు విద్యార్థులతో ముచ్చటించారు. కొంతమంది విద్యార్థులు గణితం, తెలుగు సబ్జెక్టుల్లో నిర్లక్ష్యం కనిపిస్తోందని, వారిలో మార్పుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. హైస్కూల్లో ప్రధాన



తాండవ హైస్కూల్లో మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ప్రేమ్‌కుమార్

సమస్యలను ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీదేవిని అడిగి తెలుసుకున్నారు. డి.యర్రవరం హైస్కూల్లో 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను పరిశీలించారు. ట్యాబ్‌లు వాడే విధానంపై స్వయంగా విద్యార్థుల్ని పరీక్షించారు. ప్రభుత్వం ఆశించిన విధంగా బోధనతో పాటు విద్యార్థులను అన్ని విధాలుగా తీర్చిదిద్దాలని హైస్కూల్ హెచ్‌ఎం ఆకుల కుమారికి సూచించారు.

అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 616 పాఠశాలలను మూడు విడతలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. మొదటి విడతలో రూ.55 కోట్లతో పలు పాఠశాలలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. ప్రస్తుతం నాడు నేడు పథకంలో రెండవ విడత కింద రూ.260 కోట్లతో 1,019 పనుల ద్వారా పాఠశాలల్ని అభివృద్ధి చేయనున్నట్టు వెల్లడించారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 23,135 మంది పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నట్టు తెలిపారు. గతం కంటే ఉత్తీర్ణత శాతం పెంచేందుకు దృష్టి సారించామన్నారు.

త్వరలో అనకాపల్లి-ఆనందపురం రహదారి పూర్తి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

అనకాపల్లి టౌన్: అనకాపల్లి నుంచి ఆనందపురం మీదుగా ఇచ్చాపురం వరకు ఆరు లైన్ల జాతీయ రహదారి నిర్మాణం రెండు నెలల్లో పూర్తవుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. స్థానిక న్యూకాలనీ రోటరీ కల్యాణమండపంలో బుధవారం జిల్లా, మండల కార్యకర్తల సమావేశం జరిగింది. తొలుత దివంగత పార్టీ నేత పి.వి.చలపతిరావు చిత్రపటానికి సోము వీర్రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం, నర్సీపట్నం, పాడేరు, ఎస్.కోట మీదుగా జాతీయ రహదారి నిర్మాణ పనులను కేంద్ర ప్రభుత్వం చేపడుతోందన్నారు. కేంద్ర ఆర్థిక శాఖమంత్రి సీతారామన్ బడుగు, బలహీనవర్గాలకు మేలు చేసే బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారన్నారు. ఎమ్మెల్సీ మాధవ్ మాట్లాడారు. కొత్తగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావును సోము వీర్రాజు సత్కరించారు. అంతకు ముందు చదువులవారివీధిలో పార్టీ కార్యాలయాన్ని రాష్ట్ర నాయకుడు గండి వెంకట సత్యనారాయణ ప్రారంభించారు. పార్టీ సీనియర్ నేతలు ఎర్రంశెట్టి సత్యారావు, పొన్నగంటి అప్పారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సోము వీర్రాజు

మృతుడి కుటుంబానికి రూ.36 లక్షల సాయం

రాంబిల్లి: జీఎంఎఫ్‌సీ ఫార్మా ప్రమాదంలో మృతి చెందిన రామారావు కుటుంబానికి రూ.36 లక్షల ఆర్థిక సాయం అందించేందుకు యాజమాన్యం అంగీకరించినట్లు ఎస్‌ఐ దీనబంధు తెలిపారు. గాయపడిన వారికి పూర్తిస్థాయిలో వైద్యం అందించి వారిని ఆదుకుంటామని యాజమాన్యం తెలిపిందన్నారు.

స్టాఫ్ నర్సుల కౌన్సెలింగ్

మహారాణిపేట(విశాఖ దక్షిణ): మిగిలిన ఉన్న స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీ కోసం ఈ నెల 2, 3 తేదీల్లో నాల్గో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ ఉమా సుందరి తెలిపారు. మొత్తం 179 పోస్టులకు గానూ మూడు విడతల్లో కౌన్సెలింగ్ నిర్వహించి 165 పోస్టులు భర్తీ చేసినట్లు చెప్పారు. నాల్గో విడత కౌన్సెలింగ్‌లో మిగిలిన 14 పోస్టులు భర్తీ చేస్తామన్నారు.

బ్రహ్మాండనాయకునికి భక్తజన నీరాజనం

- ఘనంగా తిరువీధి ఉత్సవం

చోడవరం: గోవింద నామస్మరణతో చోడవరం పట్టణం మార్మోగింది. కేశవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కోలాటాలు, చిటికెల భజనలతో బుధవారం అంగరంగ వైభవంగా తిరువీధి ఉత్సవం జరిగింది. ఈ వార్షిక బ్రహ్మోత్సవాలు వారంరోజుల పాటు జరగనున్నాయి. శ్రీదేవి,భూదేవి సమేతుడైన కేశవ స్వామికి ఆలయ అర్చకులు సీతారామాచార్యులు, రామకృష్ణాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. భీష్మ ఏకాదశి పర్వదినం కావడంతో ఆలయంలో స్వామివారిని పూలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. ఉదయం నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై శ్రీదేవి,భూదేవి సమేతుడైన కేశవస్వామివారి ఉత్సవ మూర్తులకు పట్టణ వీధుల్లో వైభవంగా తిరువీధి నిర్వహించారు. ఆలయం నుంచి కొత్తూరు జంక్షన్ మెయిన్‌రోడ్డు, శివాలయం వీధి, ఆర్టీసీ కాంప్లెక్స్, పాతబస్టాండ్, కాలేజీ గ్రౌండ్ మీదుగా ఊరేగించారు. తిరుమల,తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్టు కోలాటం భజన మండలికి చెందిన బృందాలు ఈ ఉత్సవాల్లో నృత్యాలు చేశాయి. స్వామివారి పల్లకీని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మోసి తిరువీధి ఉత్సవంలో పాల్గొన్నారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ అలమండల ఈశ్వరరావు, దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పప్పల జయదేవ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



తిరువీధి ఉత్సవంలో స్వామివారి పల్లకీ మోస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



కోలాటం ఆడుతున్న మహిళలు

దేదీప్యమానం

- కనుల పండువగా లక్ష దీపారాధన

నర్సీపట్నం: భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియంలో లక్ష ప్రమిదల దీపాలంకరణ నేత్రపర్వంగా జరిగింది. శ్రీ షిరిడీ సాయి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గత 21 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. లక్ష ప్రమిదల కార్యక్రమాన్ని డీసీసీబీ చైర్‌పర్సన్ చింతకాయల అనిత, మున్సిపల్ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, ఏఎస్పీ కె.ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ కనకారావు జ్యోతులు వెలిగించి ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్రి రాంగోపాల్, డాక్టర్ రామచంద్రరాజు తదితర కమిటీ పెద్దలు ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ ఏడాది దీపాలతో రూపుదిద్దిన శివుని రూపం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ అపురూప దృశ్యాన్ని వీక్షించేందుకు పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సాయినాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి కనకమహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఏకా శివ, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు బయపురెడ్డి గణమ్మ, నీటి సంఘం మాజీ చైర్మన్ లాలం అప్పారావు పాల్గొన్నారు.





ఎన్టీఆర్ స్టేడియంలో లక్ష ప్రమిదల దీపారాధన

ప్రమిదలు వెలిగిస్తున్న భక్తులు

జీ–20కి విశాఖ ముస్తాబు


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత


ఇటీవల మృతి చెందిన చలపతిరావు, తులసీరావు, అప్పారావురెడ్డికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న మేయర్

- రూ.45 కోట్లతో పనులకు ఆమోదం
- పీపీపీ పద్ధతిలో ముడసర్లోవ పార్కు అభివృద్ధికి గ్రీన్‌సిగ్నల్
- ఆరు గంటలపాటు సాగిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం(కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం) బుధవారం ప్రధాన కార్యాలయంలోని నూతన సమావేశ మందిరంలో జరిగింది. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో 15 సాధారణ అంశాలు, 89 సప్లిమెంటరీ అంశాలు, 16 అంశాలతో టేబుల్ అజెండా సభ్యుల ముందుకొచ్చింది. జీవీఎంసీ ఉద్యానవన శాఖలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న హార్టికల్చరిస్ట్‌ల వేతనాలు పెంచాలన్న అంశాన్ని సభ్యులు వాయిదా వేశారు. మిగిలిన 119 అంశాలను సభ్యులు ఆమోదించారు. జీ–20 సదస్సు, వైజాగ్ టెక్ సమ్మిట్, గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ వంటి శిఖరాగ్ర సమావేశాల నేపథ్యంలో సుమారు రూ.45 కోట్లతో నగర సుందరీకరణ, ఫుట్‌పాత్‌ల మరమ్మతులు, హాట్‌మిక్స్ పద్ధతిలో బీటీ రోడ్ల అభివృద్ధి, బీచ్‌ల సుందరీకరణ తదితర అంశాలను సభ్యులు చర్చించి ఆమోదం తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ మార్కెట్ (పూర్ణా మార్కెట్)ను పబ్లిక్ ప్రైవేట్ పద్ధతిలో కాకుండా జీవీఎంసీ నిధులతోనే పునర్నిర్మాణం చేసేందుకు సభ్యులు ఆమోదించారు. అందుకు అవసరమైన డీపీఆర్ తయారీ, ఎండ్ టు ఎండ్ సపోర్ట్ (డీపీఆర్, ఆ తర్వాతి దశలు), నిర్మాణ దశలో ప్రాజెక్ట్ మానిటరింగ్ కోసం రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్‌ఎఫ్‌పీ) పిలిచేందుకు సభ్యులు అనుమతి తెలిపారు. ముడసర్లోవ పార్కును పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేసేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. ముందుగా ఇటీవల మరణించిన బీజేపీ సీనియర్ నేత పీవీ చలపతిరావు, విశాఖ డెయిరీ దివంగత చైర్మన్ ఆడారి తులసీరావు, మాజీ కార్పొరేటర్ మరడా అప్పారావు రెడ్డికి సభ్యులు శ్రద్ధాంజలి ఘటించారు.

కంపోస్టుయార్డుకు శాశ్వత పరిష్కారం చూపాలి

అనకాపల్లి టౌన్: అనకాపల్లి జోన్ కార్యాలయం వద్ద కంపోస్టుయార్డుకు శాశ్వత పరిష్కారం చూపించాలని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత కోరారు. విశాఖలో జరిగిన జీవీఎంసీ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. సమస్య పరిష్కారం అయ్యే వరకు వ్యర్థాలు ఎప్పటికప్పుడు తరలించే విధంగా అధిక వాహనాలను అనకాపల్లి జోన్‌కు కేటాయించాలని కోరారు. ప్రత్యేక కార్యక్రమాల ద్వారా ఎప్పటికప్పుడు దోమల నివారణకు చర్యలు చేపట్టాలని, అధిక సంఖ్యలో పారిశుద్ధ్య కార్మికులను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్‌పీఎల్‌లో అర్ధ సెంచరీల మోత

దొండపర్తి (విశాఖ దక్షిణ): సాక్షి ప్రీమియర్ లీగ్ తుది అంకానికి చేరుకుంది. బుధవారం ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానంలో జరిగిన మ్యాచ్‌ల్లో అర్ధ సెంచరీల మోతతో భారీ స్కోర్లు నమోదయ్యాయి. ఉదయం మూడో స్థానం కోసం మ్యాచ్‌లు జరగగా... మధ్యాహ్నం సెమీఫైనల్స్ జరిగాయి. వీటిలో బ్యాట్స్‌మెన్ అర్ధ సెంచరీలతో ప్రత్యర్థి జట్లకు చుక్కలు చూపించి తమ జట్లను ఫైనల్స్‌కు చేర్చారు. గురువారం ఉదయం జూనియర్స్ విభాగంలో జరిగే ఫైనల్ పోరులో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్ (కంచరపాలెం), సాయి గణపతి పాలిటెక్నిక్ కాలేజ్ (గిడిజాల) తలపడనున్నాయి. అలాగే సీనియర్ విభాగంలో ఎస్‌ఎస్‌ఆర్‌ఐటీ కాలేజ్ (శొంఠ్యాం), దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అనకాపల్లి) జట్ల మధ్య ఫైనల్స్ పోరు జరగనుంది. విజేతలకు నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ చేతుల మీదుగా బహుమతుల ప్రధానోత్సవం జరగనుంది. సాక్షి మీడియా ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలకు సీఎంఆర్ షాపింగ్ మాల్ జిల్లా స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది.


శ్రీ కాశ్యప్ డిగ్రీ కాలేజ్ జట్టు


దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు


ఫైనల్స్‌కు చేరుకున్న ఎస్‌ఎస్‌ఆర్‌ఐటీ జట్టు

District sponsor

SAKSHI — సాక్షి — SAKSHI DIGITAL — MEDIA GROUP | SPL — SAKSHI PREMIER LEAGUE | CMR SHOPPING MALL — The joy of life — ANDHRAPRADESH | TELANGANA

14 పరుగుల తేడాతో ఎస్‌ఎస్‌ఆర్‌ఐటీ విజయం

బుధవారం ఉదయం జరిగిన తొలి మ్యాచ్‌లో ఎస్‌ఎస్‌ఆర్‌ఐటీ కాలేజ్ జట్టు (శొంఠ్యాం) 14 పరుగుల తేడాతో జీవీపీ కాలేజ్ ఫర్ డిగ్రీ అండ్ పీజీ జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన జీవీపీ కాలేజ్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన ఎస్‌ఎస్‌ఆర్‌ఐటీ కాలేజ్ నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 84 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జీవీపీ కాలేజ్ 9.3 ఓవర్లలో 70 పరుగులు చేసి ఆలౌట్ అయింది.

8 పరుగుల తేడాతో శ్రీ కాశ్యప్ విజయకేతనం

రెండో మ్యాచ్‌లో అవంతి ఇంజినీరింగ్ కాలేజ్ (నర్సీపట్నం), శ్రీ కాశ్యప్ డిగ్రీ కాలేజ్ (శ్రీనగర్) జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అవంతి ఇంజినీరింగ్ కాలేజ్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీ కాశ్యప్ డిగ్రీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 73 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన అవంతి ఇంజినీరింగ్ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టపోయి కేవలం 65 పరుగులు మాత్రమే చేసింది. శ్రీ కాశ్యప్ జట్టు 8 పరుగుల తేడాతో విజయం సాధించింది.

9 వికెట్ల తేడాతో దైట్ కాలేజ్ భారీ విజయం

మధ్యాహ్నం జరిగిన తొలి సెమీఫైనల్స్ మ్యాచ్‌లో రఘు ఇంజినీరింగ్ కాలేజ్(దాకమర్రి), దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్లు (అనకాపల్లి) తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్‌కు దిగిన రఘు ఇంజినీరింగ్ కాలేజ్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 79 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు 9 ఓవర్లలో కేవలం ఒక వికెట్ మాత్రమే నష్టపోయి 80 పరుగుల విజయ లక్ష్యాన్ని ఛేదించి ఫైనల్స్‌కు చేరుకుంది.

భారీ విజయంతో ఫైనల్‌కు ఎస్‌ఎస్‌ఆర్‌ఐటీ

మధ్యాహ్నం జరిగిన నాలుగో మ్యాచ్ సెమీ ఫైనల్స్‌లో ఎస్‌ఎస్‌ఆర్‌ఐటీ కాలేజ్ 46 పరుగుల భారీ ఆధిక్యంతో శ్రీ కాశ్యప్ డిగ్రీ కాలేజ్‌పై విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఎస్‌ఎస్‌ఆర్‌ఐటీ జట్టు నిర్ణత 10 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 95 పరుగుల స్కోరు నమోదు చేసింది. భారీ విజయలక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీ కాశ్యప్ డిగ్రీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి కేవలం 49 పరుగులు మాత్రమే చేయగలిగింది.

రాష్ట్రస్థాయి పోటీల్లో గురుకుల విద్యార్థుల సత్తా

నర్సీపట్నం: రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో నర్సీపట్నం బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో సింహాచలంలోని గురుకుల పాఠశాలలో జనవరి 29,30,31 తేదీల్లో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో టెన్నికాయిట్‌లో స్థానిక గురుకుల విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచి, గురుకుల సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ మోహన్ చేతుల మీదగా బహుమతులు అందుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.వెంకట రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.


క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి

తులసీరావు సేవలు చిరస్మరణీయం

- ఎమ్మెల్యే కన్నబాబురాజు
- ఘనంగా ఆడారి జయంతి
- పేదలకు దుస్తుల పంపిణీ


పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి: రైతు బాంధవుడు, విశాఖ డెయిరీ మాజీ చైర్మన్ దివంగత ఆడారి తులసీరావు సేవలు మరువలేనివని ఎమ్మెల్యే కన్నబాబు రాజు అన్నారు. యలమంచిలిలో ఆడారి తులసీరావు జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తులసీరావు ఘాట్ వద్ద ఆయన కుమారుడు, విశాఖ డెయిరీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమా కుమారిల ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు, క్లాస్ 4 ఉద్యోగులు, పేదలకు దుస్తులను ఎమ్మెల్యే కన్నబాబు రాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విశాఖ డెయిరీని అభివృద్ధి పథంలో నడిపించి, రైతుల కోసం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని చెప్పారు. ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ తన తండ్రి తులసీరావు బాటలోనే విశాఖ డెయిరీని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు,అర్రెపు గుప్త, ఎంపీపీ బోదెపు గోవింద్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఆడారి శ్రీధర్ (చిన్నా), మాజీ ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర, వైఎస్సార్ సీపీ నాయకులు ఆడారి వెంకట్, ఆడారి నాయుడు, గంధం శివ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

పాయకరావుపేట : నాగరాజుపేట గేటు సమీపాన రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్టు 108 సిబ్బంది తెలిపారు. బుధవారం రాత్రి రైలు కింద పడడంతో రెండు కాళ్ళు నలిగిపోయి మృతి చెందినట్టు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు పరిశీలించి, తుని రైల్వే పోలీసులకు సమాచారం అందించామన్నారు. ఈ విషయమై తుని రైల్వే పోలీసులను సంప్రదించగా సమాచారం తెలిసిందని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని అన్నారు.

ఫెన్సింగ్ పోటీల్లో కృష్ణ శ్రీకర్‌కు రెండు పతకాలు


పతకాలు అందుకుంటున్న గేదెల కృష్ణ శ్రీకర్

దేవరాపల్లి: చిననందిపల్లికి చెందిన గేదెల కృష్ణ శ్రీకర్ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్(కత్తి సాము) పోటీల్లో రెండు పతకాలు సాధించాడు. గత నెల 27 నుంచి 29 వరకు కర్నూల్‌లో 66వ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14 విభాగంలో జరిగిన ఫెన్సింగ్‌లో విశేష ప్రతిభ కనబరిచాడు. వ్యక్తి గత ఈవెంట్‌లో గోల్డ్ మెడల్‌ను కైవసం చేసుకున్నాడు. గ్రూపులో కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. కృష్ణ శ్రీకర్ పతకాలను సాధించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

వ్యాన్ ప్రమాదంలో డ్రైవర్ సజీవ దహనం

నర్సీపట్నం : నెల్లూరు జిల్లా కావలి వద్ద నర్సీపట్నం నుంచి కాఫీ పిక్కల లోడుతో వెళ్తున్న వ్యాన్‌లో మంటలు వ్యాపించి డ్రైవర్ సజీవ దహనమయ్యాడు. నర్సీపట్నం, గచ్చపు వీధికి చెందిన డ్రైవర్ కాకినాడ బెన్నేష్(65) కాఫీ పిక్కల లోడు తీసుకుని తిరుపతి వెళ్తున్నారు. కావలి వద్దకు వెళ్లే సరికి ముందువెళ్తున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో లోడు వ్యాన్ ఢీకొట్టింది. వ్యాన్‌లో ఉన్న గ్యాస్ సిలిండర్ ఫైర్ అయి మంటలు వ్యాపించాయి. వ్యాన్‌లో ఉన్న మరో డ్రైవర్ ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. వ్యాన్ నడుపుతున్న బెన్నేష్ మంటల్లో చిక్కుకుని సజీవదహనమయ్యాడు.

వ్యాన్‌లో మంటలు...

మాడుగుల : మాడుగులకు చెందిన లంకా కొండలరావుకు చెందిన ఏపీ31 టిఎస్3234 నంబరు గల వ్యాన్ మన్యం నుంచి వస్తుండగా గరికిబంద చెక్‌పోస్టు దగ్గరలో రాత్రి 9 గంటల సమయంలో వ్యాన్‌లో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న మాడుగుల ఫైర్ అధికారి రాజేశ్వరరావుతో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. డ్రైవర్ తప్పించుకోవడంతో ప్రాణ నష్టం జరగలేదు.

ధర్నా శిబిరం వద్ద ఉద్రిక్తత


ధర్నా నిర్వహిస్తున్న నేవీ నిర్వాసితులు


ధర్నా శిబిరం సమీపంలో పోలీసు బలగాలు

- భారీగా పోలీసుల మోహరింపు

రాంబిల్లి : నేవీ మెయిన్‌గేటు సమీపంలో నిర్వహిస్తున్న ధర్నా శిబిరం పరిసరాల్లో బుధవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జీవన భృతి సహా పలు డిమాండ్లతో నేవీ నిర్వాసితులు, నేవీ ప్రభావిత గ్రామాల ప్రజలు 94 రోజులుగా ధర్నా నిర్వహిస్తున్నారు. అయితే బుధవారం నేవీ మెయిన్‌గేటు ముట్టడితో పాటు ఆందోళనను ఉద్రిక్తం చేయాలని నిర్వాసితులు భావిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో డీఎస్పీ పి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుమారు 300 మంది పోలీసు బలగాలను ధర్నా శిబిరం, నేవీ పరిసర ప్రదేశాల్లో మోహరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యల నేపథ్యంలో భారీగా పోలీసులను మోహరించారు. తాము శాంతియుతంగా ధర్నా చేస్తామని ఉద్యమ ఐక్యవేదిక నాయకులు పేర్కొన్నారు.

గవరపాలెంలో అగ్నిప్రమాదం


అర్ధరాత్రి మంటల్లో దగ్ధమవుతున్న పశువుల పాకలు


కాలిన గాయాలతో పాడిగేదె


కాలిపోయి చనిపోయిన గేదె పెయ్యి

- రెండు పశువుల పాకలు, గడ్డి వాము దగ్ధం
- గేదె పెయ్యి మృతి, మరో గేదెకు తీవ్ర గాయాలు

కె.కోటపాడు : గవరపాలెం గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. గ్రామంలో రైవాడ కెనాల్ మార్గాన్ని ఆనుకొని ఉన్న కక్కల అప్పలనాయుడు, పారుపల్లికి చెందిన రెండు పశువుల పాకలు ఈ మంటల్లో కాలి బూడిదయ్యాయి. రైతు అప్పలనాయుడుకు చెందిన పాకలో ఉన్న గేదె పెయ్యి మంటల్లో కాలి చనిపోగా, మరో పాడిగేదె తీవ్రంగా గాయపడింది. పారుపల్లికి చెందిన పశువుల పాకలో పాడిగేదె, పెయ్యిలను గ్రామ మాజీ సర్పంచ్ నెక్కల పెంటయ్య అగ్ని ప్రమాదం నుంచి తప్పించారు. ఈ రెండు పాకలకు కొంత దూరంలో ఉన్న రైతు సిమ్మ అర్జునకు చెందిన గడ్డివాము కూడా అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. ప్రమాద ఘటనను ఎంఆర్ఐ తరంగిణి బుధవారం పరిశీలించి వివరాలను తహసీల్దార్‌కు అందించనున్నట్లు తెలిపారు. అగ్ని ప్రమాదం కారణంగా ముగ్గురు రైతులకు సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లి ఉంటుందని తెలుపుతున్నారు. బాధిత కుటుంబాలను గ్రామ సర్పంచ్ తోట భవానీ, మాజీ సర్పంచ్ నెక్కల పెంటయ్యలు పరామర్శించారు.

రైతులకు మేలు జరిగేలా భూ సర్వే

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి


సర్వే వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి

బుచ్చెయ్యపేట: రైతులకు మేలు జరిగేలా ప్రభుత్వం.. భూముల రీ సర్వే చేపట్టి, శాశ్వత భూ హక్కు కల్పిస్తోందని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. చింతపాక,చిట్టియ్యపాలెం గ్రామాల్లో జరుగుతున్న జగనన్న భూ సర్వేను, ప్రభుత్వ భవనాల నిర్మాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే పారదర్శకంగా, వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. చింతపాక రెవెన్యూలో భూ వివరాలను తహసీల్దార్ అంబేడ్కర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయం,రైతు భరోసా కేంద్రం,అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను పరిశీలించి, వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీలో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం పూర్తి స్థాయిలో అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ పథకాల మంజూరు, ఉపాధి పనుల కల్పనపై ఫిర్యాదులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సువర్ణరాజుకు సూచించారు. సర్పంచ్ గొలజాన శ్రీను,సర్వేయర్ సింహాచలం,జేఈ హరీష్,ఈవోపీఆర్డీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'అవి అటవీ భూములు కావు'


సుందరకోటలో మ్యాప్ ద్వారా అటవీశాఖ భూములకు హద్దులు పరిశీలిస్తున్న రేంజర్ లక్ష్మీనరసింహ, సిబ్బంది

నాతవరం : సరుగుడు సుందరకోట కొండలపై లేటరైట్ నిక్షేపాలు ఉన్న భూములకు, అటవీశాఖకు చెందిన భూములకు ఎటువంటి సంబంధం లేదని నర్సీపట్నం అటవీశాఖ రేంజర్ లక్ష్మీనరసింహ అన్నారు. ఆయన బుధవారం సుందరకోట ప్రాంతంలో గతంలో లేటరైట్ నిక్షేపాలు తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని సిబ్బందితో కలిసి పరిశీలించారు, సుందరకోట ప్రాంతంలో ఆక్రమంగా రోడ్డు వేసి తవ్వకాలు జరుపుతున్నట్టుగా వచ్చిన ఫిర్యాదుపై స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుందరకోట గ్రామానికి గతంలో తారు రోడ్డు వేసారని, ఇప్పుడు కొత్తగా అక్కడ ఎలాంటి రోడ్డు నిర్మాణం చేపట్టలేదన్నారు. గతంలోనే ఈ ప్రాంతంలో రోడ్డుకు అనుమతులు పొందారన్నారు. లేటరైట్ నిక్షేపాలు ఉన్న ప్రాంతంలో స్థానిక గిరిజనులతో కలిసి మా రికార్డులు ప్రకారం క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తే ఆయా భూములు రెవెన్యూ శాఖకు చెందినవి మాత్రమేనని తేలిందన్నారు. అటవీశాఖకు చెందిన భూములు లేవన్నారు. ఆయన వెంట అటవీ సెక్షన్ అధికారి మహేష్ గిరి, సిబ్బంది ఉన్నారు.

బైకు అదుపు తప్పి వ్యక్తి మృతి


రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన దుర్గాప్రసాద్

ఎస్.రాయవరం : ఎస్.రాయవరం–సర్వసిద్ధి గ్రామాల మధ్య ద్విచక్ర వాహనం అదుపు తప్పి బుధవారం ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, బాలికకు తీవ్రగాయాలయ్యాయి. ఘటనకు సంబంధించి ఎస్‌ఐ ప్రసాదరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. రాంబిల్లి మండలం కల్లిపల్లి గ్రామానికి చెందిన గుదిబండి దుర్గాప్రసాద్ (28) అత్తవారి గ్రామం ఎస్.రాయవరం వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బైకు అదుపు తప్పి పల్టీ కొట్టడంతో దుర్గాప్రసాద్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా అదే బైకుపై ప్రయాణిస్తున్న మృతుని సోదరి తీవ్రంగా గాయపడింది. స్థానికులు హుటాహుటీన 108 వాహనంలో యలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినట్టు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

క్లుప్తంగా

కమనీయం.. శ్రీనివాస కల్యాణం



అలివేలుమంగ, పద్మావతీ సమేత శ్రీనివాస కల్యాణం

అనకాపల్లిటౌన్ : స్థానిక గాంధీనగరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం భీష్మ ఏకాదశి పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. అంతకుముందు ఆలయ మండపంలో ధర్మకర్తలు పరిటి భాస్కరరావు కుటుంబసమేతంగా స్వామి వారి కల్యాణాన్ని అర్చకులు చక్రవర్తి ఆధ్వ ర్యంలో నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు అధికసంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

వేడుకగా 'ఇంటింటా గోవింద'



పెంటారావు గంగలక్ష్మి స్వగృహంలో వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

అనకాపల్లిటౌన్ : జీవీఎంసీ విలీనగ్రామమైన కొత్తూరు నర్సింగరావుపేటలో బుధవారం ఇంటింటా గోవింద కార్యక్రమాన్ని నిర్వహించారు. నర్సింగరావుపేట రామాలయం వీధిలో వీరేశ్వరవు పెంటారావు గంగలక్ష్మి దంపతుల ఇంట జరిగిన కార్యక్రమంలో భాగంగా గణపతి పూజ, విష్ణు అష్టోత్తరం, లక్ష్మీ అష్టోత్తరాలతో ప్రత్యేక పూజలు చేశారు. పూజలో పాల్గొన్న భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సీతారామ భజన బృందం అధ్యక్షుడు చూచుకొండ రమణ, కార్యదర్శి కశిరెడ్డి సుశీల, సభ్యులు పాల్గొన్నారు.

5న వయోవృద్ధుల సమావేశం

అనకాపల్లిటౌన్ : పట్టణంలో గవరపాలెం వి.వి.రమణ రైతు భారతి హాలులో ఈ నెల 5న వయోవృద్ధుల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించనున్నట్టు సంఘ వ్యవస్థాపకుడు కాండ్రేగుల అప్పారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వృద్ధులంతా సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు గౌరీ గ్రంథాలయ వార్షికోత్సవం

అనకాపల్లిటౌన్: పట్టణంలోని గవరపాలెం గౌరీ గ్రంథాలయ 80వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధ్యక్షుడు దొడ్డి నూక అప్పారావు బుధవారం తెలిపారు. ఈ వేడుకలకు నిరుద్యోగ యువత, గ్రంథాలయ సభ్యులు హాజరుకావాలని కోరారు.

అనకాపల్లి సినిమాలు

ధమాకా	- రాజా
సిందూరం	-సత్యనారాయణ స్క్రీన్-1
పఠాన్	-సత్యనారాయణస్క్రీన్-2
18 పేజెస్	-షిర్డిసాయి
పఠాన్	-పర్తిసాయి
వీరసింహారెడ్డి	-వెంకటేశ్వర
హంట్	- శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	- రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 8,454 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,550	4,200
మొదటి రకం	3,230	3,540
రెండో రకం	2,950	3,330
మూడో రకం	2,850	2,940

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 42 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-13 యూనిట్లు , బీ పాజిటివ్-8 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-13 యూనిట్లు, ఓ నెగిటివ్-4 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9182834480)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 426 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 395 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (9441108144)ని సంప్రదించవచ్చు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- బయ్యవరంలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభం



బయ్యవరంలో సామాజిక భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి గుడివాడ అమర్‌నాథ్

కశింకోట : అర్హత ఉన్న వారందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాల్సిందేనని, ఇందుకు సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదేశించారు. మండలంలోని బయ్యవరం గ్రామంలో బుధవారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. అడుగడుగునా మహిళలు మంగళ హారతులు పట్టారు. పూలదండలు వేసి, దుశ్శాలువాలు కప్పి సత్కరించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని ఆరా తీశారు. సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బ్రోచర్లను లబ్ధిదారులకు అందజేశారు. స్థానిక సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్హత ఉన్నప్పటికి పథకాలు అందట్లేదని కొందరు మంత్రి వద్ద వాపోయారు. దీంతో వెంటనే స్పందించిన మంత్రి సచివాలయ సిబ్బందిని పిలిచి సత్వరమే అర్హులకు పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకోలేని స్థితిలో ఉన్న వారికి ఇల్లు కట్టుకునేందుకు ప్రభుత్వ సహాయం అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లు వినియోగిస్తున్నారా? లేదా? అనే విషయమై 8వ తరగతి చదువుతున్న విద్యార్థులను ఆరా తీశారు. ట్యాబ్‌లు వినియోగిస్తున్నామని, ఉపయోగకరంగా ఉన్నాయని విద్యార్థులు బదులిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న ప్రాధాన్యాన్ని కొనియాడారు. రాష్ట్ర భవిష్యత్‌ను తీర్చిదిద్దగల సీఎం జగన్ ఒక్కరేనని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. జగన్ మోహన్‌రెడ్డికి మద్దతు తెలిపి, మళ్లీ ముఖ్యమంత్రిగా అధికారంలోకి తీసుకొస్తే మరిన్ని మెరుగైన సంక్షేమ పథకాలు అందించగలుగుతారని తెలిపారు.

ఈ సందర్భంగా స్థానిక కింద వీధిలో రూ.12 లక్షలతో నిర్మించిన కల్యాణ మండపాన్ని మంత్రి ప్రారంభించారు. రూ.15 లక్షలతో ఎస్సీ కాలనీలో నిర్మించనున్న సామాజిక భవనానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ గొల్లవిల్లి జయ, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు గొన్నా నాగసత్యనారాయణ, ఉప సర్పంచ్ చోడే నాగరాజు, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నీటిపల్లి లక్ష్మి, స్థానిక పార్టీ నాయకులు గొల్లవిల్లి బాబూరావు, గొల్లవిల్లి నానాజీ, బరుకు హర్ష, దాసరి బాబు, మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తూ, సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి అమర్‌నాథ్

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులు

- సామాజిక ప్రకృతి వ్యవసాయం జిల్లా ఏపీఎం స్వామినాయుడు



జి.భీమవరంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలిస్తున్న స్వామినాయుడు

కశింకోట : రైతులు ప్రకృతి వ్యవసాయం చేసి ఆరోగ్యకరమైన ఉత్పత్తులను ప్రజలకు అందించాలని సామాజిక ప్రకృతి వ్యవసాయం జిల్లా అదనపు ప్రాజెక్టు మేనేజర్ స్వామినాయుడు కోరారు. మండలంలోని జి.భీమవరం గ్రామంలో బుధవారం ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను ఆయన పరిశీలించారు. సాగుకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులను కలిసి ప్రకృతి వ్యవసాయం సాగులో ఉన్న లోటుపాట్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపాలన్నారు. ఇది ఆరోగ్యకరమైన వ్యవసాయ విధానమని పేర్కొన్నారు. దీని వలన భూముల్లో సేంద్రీయ కర్బన శాతం వృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం సాగు వల్ల ఖర్చు తగ్గి, దిగుబడులు పెరుగుతాయన్నారు. ఖరీఫ్ పంటల సాగుకు ముందు నవ ధాన్యాలు, 30 రకాల విత్తనాలు జల్లుకోవాలన్నారు. ఏడాది పొడవునా భూమిని కప్పి ఉంచాలన్నారు. ఇళ్ల వద్ద పెరటిలో ఏడాది పొడవునా ఉండే విధంగా 12 రకాల కూరగాయలు, ఆకు కూరలను ప్రకృతి సిద్ధంగా సాగు చేసుకోవాలని సూచించారు. శిక్షకుడు వర్మ, తాళ్లపాలెం యూనిట్ ఇన్‌చార్జి ద్వారపురెడ్డి రమణ, ఎంసీఆర్‌పీలు కాయల దేవి, ద్వారపురెడ్డి వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి మహిళా ధ్యాన మహాచక్రం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రేవతీదేవి

అనకాపల్లిటౌన్ : మాఘపౌర్ణమి పురస్కరించుకుని గ్రేటర్ విశాఖ విలీన గ్రామమైన సిరసపల్లి చింతామణి దత్తక్షేత్రంలో ఈ నెల 3, 4, 5 తేదీల్లో మూడు రోజులపాటు మహిళా ధ్యాన మహాచక్రం నిర్వహించనున్నట్టు క్షేత్రం నిర్వాహకురాలు టి.రేవతిదేవి తెలిపారు. స్థానిక కొణతాల సుబ్రహ్మణ్యం హాల్లో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 3వ తేదీ సాయంత్రం జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాలు మొదలవుతాయన్నారు. ధ్యానం ద్వారా కలిగే ఉపయోగాలు వివరించారు. అంతకుముందు కార్యక్రమ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పి.వి.రమణ, బి.ప్రకాష్, వీరభద్రరావు, శివాజీ పాల్గొన్నారు.

యుద్ధవీరుల విగ్రహాల ఏర్పాటుకు వినతి

- ఏ,బీ,సీ,డీ ఎస్సీ వర్గీకరణ బిల్ పార్లమెంట్‌లో పెట్టాలి
- సోము వీర్రాజుకు ఎమ్మార్పీఎస్ నేతల అభ్యర్థన



సోము వీర్రాజుకు వినతిపత్రం అందజేస్తున్న హనుమంతరావు

అనకాపల్లిటౌన్ : అనకాపల్లి-ఆనందపురం-విశాఖపట్నం ఎన్‌హెచ్-16 బ్రిడ్జికి అమరవీరుల పేరుపెట్టి మధ్యలో యుద్ధవీరుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర ఎక్స్ సర్వీస్‌మెన్ జిల్లా కో కన్వీనర్ అగ్గాల హనుమంతరావు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజుకు విన్నవించారు. ఈ మేరకు బుధవారం స్థానిక న్యూకాలనీలో పార్టీ జిల్లా కార్యకర్తల సమావేశంలో వినతి పత్రం అందించారు. దేశంలో ఎక్కడా జాతీయ రహదారులకు యుద్ధవీరుల పేర్లు లేవని, విగ్రహాలు కూడా ఏర్పాటు చేయదని, నూతనంగా నిర్మిస్తున్న జాతీయ రహదారికి వారి పేరు పెట్టేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో ఎక్స్‌సర్వీస్‌మెన్ సభ్యులు, స్థానిక పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయాలి

స్థానిక చోడవరం కాంప్లెక్స్ రహదారిలో జ్యోతిరావు పూలే విగ్రహానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కట్టమూరి మంగరాజు ఏబీసీడీలుగా ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాల్సిందిగా కోరుతూ సోము వీర్రాజుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కొల్లి చిన్నఅప్పారావు, గొటివాడ సామ్రాట్ కుమార్, చిందాడ నూకేశ్వరరావు, అరుగుళ్ల కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

బయ్యవరంలో 'గడప గడపకు' నేడు

కశింకోట : మండలంలోని బయ్యవరం గ్రామంలో రెండో రోజు గురువారం ఉదయం 8 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభం కానున్నట్టు ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఈ కార్యక్రమంలో పాల్గొని, ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును తెలుసుకుంటారన్నారు.

ఆయుర్వేదంతో వ్యాధి నిరోధక శక్తి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న లావణ్య

అనకాపల్లిటౌన్ : ఆయుర్వేద వైద్యంతో వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవచ్చని వైద్యాధికారిణి లావణ్య అన్నారు. స్థానిక భీమునిగుమ్మం జీవీఎంసీ హైస్కూల్లో విద్యార్థులతోటు వారి తల్లిదండ్రులకు స్కూల్ ఆవరణలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరోనా మహమ్మారిని కూడా ఈ వైద్యం నయం చేసిన సందర్భాలున్నాయని వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజ్యలక్ష్మి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా సమర యాత్రను జయప్రదం చేయండి



సమర యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

అనకాపల్లి రూరల్ : ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకై యువజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న సమర యాత్రను విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా సెక్రటరీ ఎస్‌వీ నాయుడు కోరారు. బుధవారం అనకాపల్లి దొడ్డి రామునాయుడు భవన్‌లో యాత్రకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకూ జరిగే పాదయాత్రలో విద్యార్థులు, యువకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, గిరిజన వర్సిటీ ఏర్పాటు, రైల్వేజోన్, నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగావకాశాల కోసం ఈ సమర యాత్ర సాగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రటరీ రమణ, ఏవైఎఫ్ఐ జిల్లా సెక్రటరీ వియ్యపు రాజు, ఫణీంద్ర కుమార్, భాస్కర్, గొర్లి తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు పీపీఆర్ టీకాలు



జమాదులపాలెంలో మేకలకు టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

కశింకోట : జిల్లాలో గొర్రెలు, మేకలకు ఈ నెలాఖరు వరకు పారుడు వ్యాధి నివారణకు పీపీఆర్ టీకాలు వేయనున్నట్లు జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ బి.ప్రసాదరావు తెలిపారు. మండలంలోని జమాదులపాలెం గ్రామంలో గొర్రెలు, మేకలకు పీపీఆర్ టీకాలు వేసే కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకలకు ఉచితంగా టీకాలు, చెవి పోగులు వేయించాలని పెంపకందారులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కరక రాజ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి కరక శేషు, సహాయ సంచాలకుడు పి.భానుబాబు, డాక్టర్ బి.సౌజన్య, డాక్టర్ ఆల్ఫోన్స జార్జి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి విస్తరణ బాధితులకు మెరుగైన పరిహారం

మునగపాక : పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులకు మెరుగైన పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ తెలిపారు. మండలంలోని గంగాదేవిపేట పైడితల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో తోటాడ రెవెన్యూ పరిధిలోని రైతులు, రహదారి విస్తరణ బాధితులతో బుధవారం సాయంత్రం సమావేశం అయ్యారు. భూ చట్ట ప్రకారం పరిహారం అందించేలా కృషి చేస్తామన్నారు. బాధితుల సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో సీఐటీయూ నేత బ్రహ్మాజీ, రైతులు బొద్దపు శ్రీరామమూర్తి, నరాలశెట్టి తాతారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగపరచుకోండి



చిన్నారులకు అన్నప్రాశన చేస్తున్న ప్రభావతి

అనకాపల్లిటౌన్ : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఎన్నో పథకాలు అమలు చేస్తోందని సీడీపీవో ప్రభావతి నిర్మలకుమారి అన్నారు. స్థానిక రైల్వేకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో ఆమె బుధవారం చిన్నారులకు అన్నప్రాశన చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నిర్మలకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మావతి, పద్మ, ఆయాలు, ఈశ్వరరావు, పి.వరలక్ష్మి, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టాయిలెట్ల నిర్మాణ పనులకు శ్రీకారం



సచివాలయాల్లో టాయిలెట్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

అనకాపల్లి రూరల్ : మండలంలోని తుమ్మపాల సచివాలయంలో సిబ్బంది వసతి సదుపాయాలకు సంబంధించి శౌచాలయం నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి భూమి పూజ చేసి సచివాలయంలో టాయ్‌లెట్స్ నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఇందులో వార్డు సభ్యురాలు కొయ్య జగదాలక్ష్మి, కొయ్య భాస్కర్, శ్రీను, ఎస్ఎంసీ చైర్మన్ గొంతెన శ్రీను, సెక్రటరీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం



నాగేశ్వర, జనార్దన్ స్వాముల ఊరేగింపు



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

అనకాపల్లిటౌన్ : స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం ఆలయ 98వ వార్షికోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. స్వామివారి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని ధ్వజారోహణం, బలిహరణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం నాగేశ్వర, జనార్దన్ స్వాముల తిరువీధోత్సవం నేత్రపర్వంగా జరిగింది. అంతకుముందు చిన్నవీధి రామాయలం నుంచి ఎదురు సన్నాహ కార్యక్రమం ప్రారంభమయింది. రాత్రి 8 గంటలకు స్వామివారి కల్యాణం కమనీయంగా జరిగింది. కల్యాణ వేడుకలను తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాసరావు, అర్చకుడు బేబి పాల్గొన్నారు.

4న గౌరీపరమేశ్వరుల ఉత్సవం

మునగపాక : గౌరీ పరమేశ్వరుల ఉత్సవాన్ని విజయవంతం చేయాలని ఐటీ, వాణిజ్య,పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కోరారు. ఈ నెల 4న మునగపాకలో నిర్వహించనున్న గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలకు సంబంధించి పోస్టర్‌ను ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ ఏటా ఫిబ్రవరి తొలి శనివారం నిర్వహించే ఉత్సవాన్ని ఈ ఏడాది కూడా అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా చేసుకోవాలన్నారు. ఉత్సవ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించేలా చూడాలన్నారు. ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, ఉత్సవకమిటీ చైర్మన్ ఆదినారాయణ, కార్యదర్శి అప్పలనాయుడు, వెంకట్, భరణి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు జాబితాపై సీపీఎం ఫిర్యాదు

అనకాపల్లి రూరల్ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాలో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ సీపీఎం నేతలు జిల్లా కలెక్టర్ పేరిట బుధవారం ఫిర్యాదు చేశారు. గత డిసెంబర్ 30న విడుదల చేసిన ఓటరు జాబితాలో గుర్తించిన పలు అవకతవకలను పేర్కొంటూ ఫిర్యాదును అనకాపల్లి డీఆర్వో వెంకటరమణకు అందించారు. నిబంధనల మేరకు డిగ్రీ విద్యార్హత లేనివారిని ఓటర్లుగా చేర్చడం, డబుల్ ఎంట్రీలు, ఎలాంటి విద్యార్హత లేని నిరక్షరాస్యులను, కొందరు రైతులను, మునగపాకలో ఇతర మండలానికి చెందిన ఓటర్ల పేర్లను చేర్చారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అర్హత కలిగి సకాలంలో ఓటరు దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో చేసుకున్న వారిని ఓటర్లుగా జాబితాలో చేర్చలేదని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను ఫిర్యాదులో పొందుపర్చారు. తాము పేర్కొన్న లోపాలు, అక్రమాలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా పార్టీ జిల్లా కార్యదర్శి కె లోకనాథం, జిల్లా కమిటీ సభ్యులు వీవీ శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ, అల్లు రాజు తమ ఫిర్యాదులో కోరారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలి



నిరసన ప్రదర్శనలో ఆప్ నేతలు

అనకాపల్లిటౌన్ : పార్లమెంట్ సమావేశాల్లో రాష్ట్ర ఎంపీలందరూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని అడ్డుకోవాలని ఆప్ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథబాబు అన్నారు. ఈ మేరకు స్థానిక నెహ్రూచౌక్ కూడలి అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం నిరసన తెలిపారు. యజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపకపోతే లక్షలాది కుటుంబాలు రోడ్డునపడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఎంపీలందరూ పార్లమెంట్ సమావేశాల్లో నిరసన తెలియజేయాలని కోరారు. ఏపీకి ప్రత్యేకహోదా ఇవ్వాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకోవాలన్నారు. పార్టీ నేతలు బాబ్జీ, శ్రీనివాసరావు, నారాయణరావు పాల్గొన్నారు.

బవులవాడలో భీష్మ ఏకాదశి పూజలు



భీష్మ ఏకాదశి పూజలో పాల్గొన్న భక్తులు

అనకాపల్లి రూరల్: మండలంలోని బవులవాడ గ్రామంలో జగత్ జ్యోతి విశ్వశాంతి మహాక్షేత్రంలో బుధవారం పూడి రామకృష్ణమాచార్య ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా టీడీపీ బీసీ సాధికార సమితి గవర కన్వీనర్ మళ్ల సురేంద్ర హాజరై స్వామివారికి పూజా కార్యక్రమాలుచేపట్టారు. ఈ సందర్భంగా మళ్ల సురేంద్ర మాట్లాడుతూ భక్తి భావంతో సత్వగుణం అలవడుతుందన్నారు. అంతకు ముందు క్షేత్రంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు.

తెలుగు భాష పరిరక్షణపై పోటీలు



తెలుగుభాషపై నిర్వహించిన పోటీల్లో విజేతలతో సమితి ప్రతినిధులు

అనకాపల్లి రూరల్: మండలంలోని కూండ్రం హైస్కూల్‌లో బుధవారం తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు పద్యపఠన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. మూడో తరగతి నుంచి టెన్త్ వరకు వివిధ స్థాయిల్లో నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి కన్వీనర్ కొయిలాడ రామ్మోహన్, పద్యకవి తమ్మిరాజు, రచయిత్రి అమరజ్యోతి, కవయిత్రి గాయత్రి తెలుగుభాష విశిష్టత గురించి వివరించారు. కరోనా వైరస్, చెట్ల ఆవశ్యకత, ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాల గురించి పిల్లలు చేసిన ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో తెలుగు పండిట్ కోరాడ అప్పలరాజు, హెచ్ఎం పి.రాణి, టీచర్ లక్ష్మి, పీడీ ధనుంజయ్, సరళ తదితరులు పాల్గొన్నారు.